

# కృతజ్ఞత

గన్నంరాజు సుందరరావు

కాలింగ్‌బెల్ మోగింది మేనేజర్ గదిలో.

స్వింగ్‌డోర్ తెరుచుకొని లోనికి వెళ్ళాడు ప్యూన్.

సుందరరామయ్య నిటారుగా కూర్చుని, ఆదుర్దాగా మేనేజర్ రూంకేసి చూడసాగాడు.

అయిదు నిముషాలు గడిచాయి.

రెండుచేతుల్తో ఫైల్స్ పట్టుకొని బయటకు వచ్చిన ప్యూను సెక్షన్స్ వేపు వెళ్లిపోయాడు.

గాఢంగా నిట్టూర్చి, నీరసంగా వెనక్కి జారగిలబడిపోయాడు సుందరరామయ్య.

అతడు మేనేజర్ గదిముందు వరండాలో బెంచీమీద కూర్చున్నాడు.

అతనికి మహ చికాకుగా వుంది. క్షణ క్షణానికీ ఓరిమి నశిస్తోంది. వచ్చిన పని సానుకూలమవుతుందో లేదో అనే దిగులు విపరీతంగా పీడిస్తోంది. మనస్సు ఆశానిరాశల మధ్య ఊగిసలాడుతోంది.

మేనేజర్ గదివేపు తదేకంగా చూస్తూ ఆలోచిస్తూ కూర్చున్నాడు నిశ్శబ్దంగా...

ఇంకా ఎంతకాలం తనిలా నిరీక్షించాలి? దాదాపు గంటన్నర గడిచింది తనిక్కడికి వచ్చి. రాగానే ఇంటర్వ్యూ కోరుతూ తన పేరూ, మిగతా వివరాలూ స్లిప్‌మీద రాసి మేనేజర్ నిరంజన్‌కి పంపించాడు. అప్పటినుంచీ నిరీక్షిస్తున్నాడు .... గంటన్నరగడిచి రెండోగంట పూర్తికావస్తోంది.

....ప్చ్.... తనెంత తొందరపడుతున్నాడో అంత ఆలస్యం అవుతోంది.

తను పంపిన స్లిప్ ఇంకా నిరంజన్ చూడలేదు కాబోలు....బహుశా బిజీగా వున్నాడేమో ...అదే అయ్యుంటుంది.... చూస్తే ఇంతసేపు ఉపేక్షిస్తాడా!?

పరుగు పరుగున వచ్చి,ఆప్యాయంగా తనని పలకరించి, కాళ్లమీద పడినంత హంగామా చేసి....

'ఎన్నాళ్లకి మీ దర్శన భాగ్యం కలిగింది మాస్టారూ' అంటూ ఆనంద పడిపోయి....సాదరంగా తనని వాడి రూంలోకి తీసుకెళ్లి పక్క కుర్చీలో కూర్చోబెట్టుకొని, కుశలప్రశ్నలూ అవీ అయాక....

'మాస్టారూ! ప్రస్తుతం మీ రాకకు గల కారణం ఏమిటో చెప్పండి. ఏం కావాలో శలవియ్యండి, నేనేం చెయ్యాలో ఆజ్ఞాపించండి. మీ ఆజ్ఞను శిరసావహించ డానికి సిద్ధంగావున్నాను.' కన్నీళ్లతో తనకి నమస్కరిస్తూ ప్రాధేయపడతాడు.

అప్పుడు వాడిని వూరడించి, తన పరిస్థితులన్నీ ఏకరువుపెట్టి, తనెందుకు వచ్చిందీ వివరిస్తాడు.

వాడు విపరీతంగా బాధపడిపోయి, 'ఫరవాలేదు మాస్టారూ ఇటుపైన మీరు నిశ్చింతగాజీవించే ఏర్పాట్లుచేస్తాను. మీరు ధైర్యంగా వుండండి. మీ సమస్యలన్నీ పరిష్కరించే భారం నాది. గత కొన్ని సంవత్సరాలుగా మీకోసం గాలిస్తున్నాను. మీ ఆచూకీ తెలియక ఎంతగానో పరితపిస్తున్నాను. మీరు కనిపించరేమో అనే నిరాశతో క్రుంగిపోతున్న నాకు ఈ మూలంగా మీ దర్శన భాగ్యం లభించింది. నాకెంతో ఆనందంగా వుంది' అంటాడు సంబరబడిపోతూ....

అవును....తప్పకుండా తన రాక వాడికి మహదానందాన్ని కలిగిస్తుంది. వాడికి తనంటే ఎంత భక్తి! ఎంత గౌరవం! ఎంత అభిమానం!

అఖండమైన తెలివితేటలూ, వినయ విధేయతలూ, వాడి సొత్తు. చిన్ననాటి నుంచీ తను అలా తీర్చిదిద్దాడు వాణ్ని.

ఎన్నడూ తనమాట జవదాటి ఎరగడు. ఏ పని చెప్పినా క్షణాలమీద చేసుకొచ్చే వాడు. అడుగులకు మడుగులొత్తుతూ, నమ్మినబంటులా మెసులుకొనేవాడు.అలా గని తనెప్పుడూ చిన్నచూపు చూడలేదు వాణ్ని. తన పిల్లలకంటే అపురూపంగా ఆదరంగా చూసేవాడు.

బీ. కాం. పాసయ్యాక వాడికి ఉద్యోగం దొరికింది. ఆనాడు తమని విడిచివెళ్లడానికి ఎంత క్రుంగిపోయాడు! 'మాస్టారూ! మీ దయవల్ల నేను ఉద్యోగస్తుణ్ణయాను. ఇదంతా మీ చలవే, మీ ఆశీర్వాదబలమే - చిన్నతనంలోనే తల్లితండ్రులను పోగొట్టుకొన్న దుర దృష్టవంతుణ్ని చేరదీసి, ఆశ్రయం ఇచ్చి, విద్యాబుద్ధులుచెప్పి, నన్ను వృద్ధిలోకి తెచ్చి, నాకాళ్లమీద నేను నిలబడగలిగే శక్తిని ప్రసాదించారు. జన్మ జన్మలకీ మరువరానిది మీరుచేసిన మేలు. మీఋణం

ఏంచేసినా తీరదు. ఎన్నటికీ తీరదు. మీరు ఆదుకోకపోతే నేను గాలికీ ధూళికీ పెరిగి దిక్కుమాలిన బ్రతుకు బ్రతికి, కూలిచేసుకునో, రిక్షా తొక్కుకునో దుర్భర జీవితం గడపాల్సిన గతి పట్టేది. నిజంగా మీరు దేవుడు మాస్టారూ దేవుడు' అంటూ కాళ్లమీదపడి వాపోయాడు.

ఉద్యోగంలో జాయినయాక చాలా కాలంవరకూ ఉత్తరాలురాసి తమ యోగ క్షేమాలు తెలుసుకొని ఆనందించేవాడు.

కాలక్రమాన సంసారపు గొడవల వల్ల అశ్రద్ధవల్ల తను వాడికి జవాబులు వ్రాయడం మానేశాడు.

అలా ఉత్తర ప్రత్యుత్తరాలు తమ మధ్య నిలిచిపోయాయి. తదనంతరం వాడెక్కడున్నాడో, ఎలా వున్నాడో అనే ఆలోచనలు కూడా తననుంచి దూర మాయాయి ..... ప్చ్ .... పాపం .... తన నిర్లక్ష్యవైఖరికి వాడు చాలా బాధపడి వుంటాడు.

మళ్లీ కొంతకాలానికి తను వాణ్ని చూడబోతున్నాడు.అదీ యాదృచ్ఛికంగా। తను కలుసుకోబోయే అధికారి నిరంజన్ అని తెలిసిన క్షణంనుంచీ తన ఆశ చిగుళ్లు తొడిగి, శాఖోపశాఖలుగా విస్తరించి మహావృక్షమైంది. కొండంత ధైర్యం తనని ఆవహించింది. ఎన్ని గంటలు నిరీక్షిస్తే ఏం ? ....చిట్టచివరకు తను సత్ఫలితాన్నే పొందుతాడు.

ఇన్నాళ్లూ తను పడిన, పడుతున్న అవస్తలీన్నీ,అనునిత్యం ఎదుర్కొంటున్న విషమపరిస్థితులీన్నీ, అపరిష్కృతంగా నిలిచిపోయిన సమస్యలనీ వివరిస్తే నిరంజన్ హృదయం ద్రవించక మానదు.

తప్పకుండా తనని ఆదుకొని, తన జీవనమార్గాన్ని కొంతవరకైనా సుగమం చేస్తాడు .... శేషజీవితం నిశ్చింతగా....

కాలింగ్‌బెల్ మ్రోగింది మళ్లీ.

ప్యూన్ లోపలికి ఉరికాడు.

ఆలోచనలకి స్వస్తిచెప్పి సర్దుకొని కూర్చున్నాడు సుందరరామయ్య.

ప్యూన్ బయటకు వచ్చాడు ఫ్లాస్క్ పట్టుకొని–

"అయ్యగారు పిలుస్తున్నారు వెళ్లండి." సుందరరామయ్యతో అనేసి వీధిలోకి వెళ్లిపోయాడు.

వెంటనే లేచాడు సుందరరామయ్య. శరీరం సన్నగా కంపించ నారంభించింది. పెదవులపై చిరుదరహాసం వెలిసింది. ఏదో తెలియని ఆనందం, ఆవేదన, ఒక విధమైన మొహమాటం కలుగుతున్నాయి అతనికి.

సంచీ, గొడుగూ చేత్తో పట్టుకున్నాడు. ఆదుర్దాగా రెండడుగులు వేశాడు. ఒకసారి ఆగి, తనని తాను పరికించి చూసు కున్నాడు.

చాలా దూరం బస్సులోనూ, ట్రెయిన్ లోనూ ప్రయాణంచేసి రావడంవల్ల బట్టలు బాగా మాసిపోయాయి. చొక్కా కొద్దిగా చెమటకి తడిసింది. అరిగిన



అకు చెప్పులు దుమ్ముపట్టి వున్నాయి. చేతిలో పాతగొడుగూ, మాసిన గుడ్డసంచీ చాలా అసహ్యకరంగా వుంది ఆకారం.

తనని తానే ఏవగించుకుంటూ–తనని పీడిస్తున్న దరిద్రాన్ని నిందించుకుంటూ–మేనేజర్ రూంలో అడుగుపెట్టాడు.

మేనేజర్ నిరంజన్ రివ్వాలింగ్ చెయిర్‌లో హుందాగా కూర్చుని ఏదో ఫైల్ తిరగేస్తున్నాడు.

తలెత్తి సుందరరామయ్యకేసి చూచి నమస్కరించి "హల్లోండి" అన్నాడు గంభీరంగా.

ప్రతినమస్కారం చేసి, తడబడుతూ ఓ కుర్చీలో కూర్చుని ''కులాసాగా ఉన్నావా బాబూ?" అన్నాడు ఆప్యాయంగా సుందరరామయ్య.

అటునుంచి ఏం సమాధానం రాలేదు.

దీక్షగా ఫైల్‌లోని కాగితాలను పరిశీలిస్తున్నాడు నిరంజన్.

సుందరరామయ్య వదనం వివర్ణమైంది.

ఆశించిన విధంగా ఆదరణ లభించలేదు. గౌరవ మర్యాదలు జరగలేదు.

'తను తప్పుగా ఊహించాడు. అసలు అలా ఊహించడం నిజంగా తప్పు-వాడిక్కడ అధికారి అన్న సంగతి విస్మరించాడు తను. వాడి దృష్టిలో తనెంతటి మహనీయుడైనా క్రింది ఉద్యోగులందరూ వుండగా ఆఫీసులో అలా ప్రవర్తిస్తాడా? వాడి స్టేటస్‌కి భంగం రాదూ....ఏది ఏమైనా తనిప్పుడు సహాయం కోరివచ్చాడు. అది లభ్యమైతే చాలు. అదే మహద్భాగ్యం. గౌరవ మర్యాదలు జరక్కపోతే పోయే దేముంది?' తనని తాను సమాధాన పరుచుకొని నిరంజన్‌కేసి చూస్తూ కూర్చున్నాడు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా దొర్లి పోయాయి.

"ఏదైనా పనిమీద వచ్చారా?" అంటూ చేతిలోని ఫైల్‌ని టేబుల్‌మీదవేసి మరొక ఫైల్ తీశాడు నిరంజన్.

"అఁ...." ఇంకా ఏదో మాట్లాడ బోయాడు-కాని గొంతు పెగలడంలేదు. తన రాకకి గల కారణాన్ని ఎలా వివరిం చాలో బోధపడక మథనపడసాగాడు.

"చాలకాలమైంది మిమ్మల్ని చూసి-అంతా కులాసాయేనా?" అన్నాడు నిరంజన్ ఫైల్‌ని పరిశీలిస్తూ.

"అఁ....ఏదో....అలాగ...." తడ బడ్డాడు సుందరరామయ్య.

"ఇంతకూ మీరు వచ్చిన పనేమిటో చెప్పారు కాదు."

కొద్దిక్షణాలు మౌనంగా వుండి "నిన్నొక సహాయం అడుగుదామని వచ్చాను." మొహమాటపడుతూ అన్నాడు సుందరరామయ్య.

"సహాయమా?...ఏమిటది?" ఆశ్చర్యంగా చూశాడు నిరంజన్.

కొద్దిసేపు తటపటాయించి మంద్ర స్వరంతో అన్నాడు సుందరరామయ్య. "ఏంలేదూ.... మా శ్రీధరం నీకు తెలుసుగా, ఎం.కాం. ఫస్ట్‌క్లాస్‌లో పాస యాడు. శతవిధాల ప్రయత్నించినమీదట గతవారంలో వాడికి కాల్‌లెటర్ వచ్చింది. ఈ నెల 20వ తేదిన మీ ఆఫీసులో జరుగబోయే ఇంటర్‌వ్యూకి వాడూ హాజరుకావాలి. ఇక్కడి మేనేజర్‌గారే ఇంటర్‌వ్యూయర్‌గా వుంటారని తెలిసింది. ముందుగా వారితో మాట్లాడి నా ప్రస్తుతపరిస్థితులు వివరించుకొని ఒక పోస్ట్ మా వాడికి ఇప్పించమని అర్థించడానికి వచ్చాను. అదృష్టంకొద్దీ ఇక్కడికి రాగానే, నేను కలుసుకోబోయే అధికారి నువ్వేఅని తెలిసింది. నాకెంతో

ఆనందంగావుంది. నువ్వు ఎలాగైనా ఈ సహాయం చేస్తావని ఆశిస్తున్నాను."

"అర్హతలుంటే తప్పకుండా సెలెక్ట్ అవుతాడు. ఇందులో నేను చేయవలసిన సహాయం ఏముంది?"

"అర్హతలుంటే సెలెక్టవుతాడు.... ఆ మాట నిజమే....కానీ...." నసిగాడు సుందరరామయ్య.

చప్పున తలెత్తి సూటిగా చూశాడు నిరంజన్.

"చూడండి మాస్టారూ.... మీరు చెప్పబోయేదేమిటో నేనూహించ గలిగాను. అర్హతలున్నా లేకున్నా మీ శ్రీధర్ ని సెలెక్టచేయాలంటారు అంతేనా" అన్నాడు సీరియస్‌గా.

సుందరరామయ్య ముఖం వికసించింది.

"అంతే బాబూ.... అంతే.... ఆమాత్రం నువ్వు ఆదుకుంటే చాలు నాకు కాస్త రిలీఫ్ దొరుకుతుంది. మా శ్రీధరం చాలా తెలివైనవాడు. గత రెండేళ్లుగా ఎన్నివిధాల ప్రయత్నించినా వాడికో ఉద్యోగం దొరకలేదు. దైవికంగా ఇప్పుడు కాల్ లెటర్ వచ్చింది. ఈ అవకాశానైనా దక్కించుకుందామనే ఆశతో వచ్చాను. నువ్వు వాడికి ఉద్యోగం ఇవ్వాలి. నీ మేలు మరిచిపోలేను...." ఆశగా చూస్తూ అన్నాడు.

నిరంజన్ అసహనంగా చూశాడు.

"క్షమించండి మేం కోరిన అర్హతలు లేనివాళ్లని సెలెక్ట్ చెయ్యడం జరగదు. ఈ విషయంలో సిఫార్సులకీ, మొహమాటాలకి తావు లేదు. ఇంటార్వ్యూ అయాక మెరిట్‌ని బట్టి కేండిడేట్స్‌కి ఉద్యోగాలివ్వబడతాయి. దేవేంద్రుడు దిగొచ్చినా ఈ నిర్ణయం మారదు. పాపం మీరు అనవసరంగా శ్రమపడి వచ్చినందుకు విచారిస్తున్నాను" అన్నాడు గంభీరంగా.

హతాశుడయాడు సుందరరామయ్య. అతని అంతరంగంలో కల్లోలం చెలరేగింది. ఒళ్లంతా చెమటలు పోసాయి. చేతికందుతుందనుకున్న పెన్నిధి జారిపోతున్నట్టు నిరాశా నిస్పృహలతో క్రుంగిపోయాడు. ఆ అవస్థనుండి తేరుకోడానికి కొన్ని క్షణాలు పట్టింది.

"... నిరంజన్!.... ప్రస్తుతం చాలా కష్టాల్లో వున్నాను. పూర్వం వుండే ఆస్తి పాస్తులూ ఉద్యోగం, ఇప్పుడు లేవు. ఆ కాలంలో అర్ధబలం, అంగబలం వుండేవి గనుక ఎంతోమందికి ఎన్నో ఉపకారాలు చేశాను. అది నీకూ తెలుసు. నాకుండే ఆస్తి అంతా అందుకే వెచ్చించాను. అందువల్ల నా పిల్లలు పెరిగి పెద్దవాళ్లయే సరికి ఇల్లుతప్ప ఇంకేమీ మిగలలేదు. ఆడపిల్లలు నలుగురిలో ఎలాగో ఇద్దరి పెళ్లిళ్లు జరిపించాను. అష్టకష్టాలు పడి శ్రీధరం చదువు పూర్తిచేయించాను. ఇద్దరాడపిల్లలు ఇంకా చదువుకుంటున్నారు. వాళ్ల పెళ్లిళ్లు చేయాల్సి వుంది.

వచ్చే పెన్షన్ డబ్బులు నే నొక్కణ్ణి అతి నికృష్టంగా బ్రతకడానికే సరిపోతాయి. ఇక సంసారం నెట్టుకురావడం ఎలా సాధ్యమవుతుంది? అందువల్ల కుటుంబపరిస్థితి రాను రాను అధ్వాన్నస్థితికి దిగజారుతోంది. ఒక్కొక్కసారి పస్తులే శరణ్యమవుతున్నాయి. ఈ వృద్ధాప్యంలో ఇంటింటికీ తిరిగి ట్యూషన్స్ చెప్పలేక సతమతమవుతున్నాను. దినదినానికీ ఓపిక సన్నగిల్లుతూండడంవల్ల నామీదున్న బాధ్యతలను సంక్రమంగా నిర్వర్తించలేని అసమర్థుణ్ణవుతున్నాను. అప్పుడప్పుడు ఈ బంధాలన్నిటిని త్రెంచుకొని ఎక్కడైనా పారిపోవాలనిపిస్తూంటుంది. నువ్విప్పుడు కనికరిస్తే కొంతవరకైనా నా కష్టాలు కడతేరతాయి." దీనంగా అన్నాడు సుందరరామయ్య.

కొద్దిక్షణాలు ఆలోచించాడు నిరంజన్- తరువాత ఏదో నిర్ణయానికివచ్చి అన్నాడు "అయాం వెరీ సారీ మాష్టారూ.... మీ పరిస్థితి ఏవిటో మిమ్మల్ని చూడగానే గ్రహించాను. కానీ నన్నేం చేయమంటారు చెప్పండి. నీతి నియమాలను ఉల్లంఘించి నేనేమీ చేయలేను. అది చిన్ననాటినుంచీ అలవడిన గుణం. మీరు చేసిన బోధనలూ, ఇచ్చిన తర్ఫీదూ అలాంటివి. అంచేత మీరేమనుకున్నా సరే ఈ విషయంలో మీకు ప్రత్యేకమైన సహాయం చెయ్యలేను. చేస్తానని హామీ ఇవ్వలేను."

సుందరరామయ్య కృంగిపోయాడు.

"నిరంజన్!.... కొండంత ఆశ పడ్డాను.... నీకు నా మీద భక్తివిశ్వాసాలుంటాయనీ, నన్ను ఆదుకుంటావనీ పొంగిపోయాను. కాని ఇలా జరుగుతుందని ఊహించలేకపోయాను" అన్నాడు నీరసించిన స్వరంతో.

నిరంజన్ తీక్షణంగా చూశాడు.

"చేసిన ఉపకారానికి ప్రతిఫలం ఆశించకూడదనేవారు మీరు. బహుశా మరిచిపోయారనుకుంటాను. నీతులను ఆచరణలో పెట్టడం బోధించినంత సులభం కాదన్నమాట నిజమేననిపిస్తోంది. ఆనాడు నన్ను చేరదీశారనీ, ఆదరించారనీ ఈనాడు నా ప్రిన్స్‌పల్స్‌కి వ్యతిరేకంగా ప్రవర్తించలేను. ఉన్నతాదర్శాలూ, ఉత్తమ వ్యక్తిత్వంగల మీరు ఇలా ఎత్తిపొడుపు మాటలనడం భావ్యం కాదు. ఇంటర్వ్యూకి ముందుగా మీరు నన్ను కలుసుకొని ఈ విషయం ప్రస్తావించడం ధర్మ విరుద్ధమని మీకు చెప్పనవసరం లేదనుకుంటాను."

సుందరరామయ్య జీవంలేని నవ్వు నవ్వాడు.

"....నా మాటల్ని నువ్వు అపార్థం చేసుకున్నావు నిరంజన్!.... ఆపదలో వున్నాను ఆదుకోమని నిన్నర్థిస్తున్నానే కాని, గతంలో నేను చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చెయ్యమని కోరడంలేదు. ప్రతిఫలాన్ని ఆశించి నేను ఏనాడూ ఎవరికీ ఉపకారం చెయ్యలేదు. చెయ్యడం

లేదు. బహుశా అది ఉపకారమనిపించు కోదనుకుంటాను. ఆవేదనని అణచుకో లేక నేనన్న మాటలు నీ మనసును గాయపరిచాయి. ఆవేశంగా ఏమేమో మాట్లాడావు. అందుకు నేను బాధపడడం లేదు.... సరే అదంతా ఎందుకూ? చివరిసారిగా అడుగుతున్నాను నాకీ హెల్ప్ చెయ్యలేవా?....'' అన్నాడు జాలిగా చూస్తూ.

"వెరీ సారీ - నాదెప్పుడూ ఒకటే మాట.... ఒకటే నిర్ణయం...." దృఢంగా అనేసి తన పనిలో నిమగ్నుడయాడు నిరంజన్.

సుందరరామయ్య హృదయం ముక్కలయింది. కళ్ళముందు చీకట్లు అలుముకోసాగాయి. అతనికి నర నరాల్లోనూ అపరిమితమయిన నిస్సత్తువ ఆవహించింది. నీరసంగా లేచాడు. వాణికే పెదవులతో ఏదో అనబోయాడు కాని గొంతు పెగలలేదు. నిరంజన్‌కేసి కన్నార్పకుండా చూస్తూ 'వీడు ఆనాటి నిరంజన్ కాడు. అంతస్తూ, అధికారం వీణ్ని మార్చేశాయి. తనేం చెప్పినా వినిపించుకొనే స్థితిలో లేడు. వృధా ప్రయాస తప్ప ప్రయోజనం లేదు' అనుకుంటూ బరువుగా నిట్టూర్చి నెమ్మదిగా బయటకు నడిచాడు.

"అప్పుడే వచ్చేశారా బాబూ.... అయ్యగారితో మాట్లాడారా? వెళ్ళిన పని అయిందా?" సుందరరామయ్యకేసి జాలిగా చూస్తూ ప్రశ్నించాడు ప్యూన్ రోడ్డుమీద ఎదురై. జరిగినది క్లుప్తంగా చెప్పాడు సుందరరామయ్య. అలా చెప్పు కున్నాక అతని హృదయావేదన కాస్త తగ్గినట్టయింది.

గాఢంగా నిట్టూర్చి తన విచారాన్ని వ్యక్తంచేస్తూ అన్నాడు ప్యూన్-

"ఇక్కడ కావలసినవి అర్హతలు కావు బాబూ తాహతు. తాహతు లేని వాళ్ళకి ఉద్యోగాలు దొరకడం అసంభవం."

"అంటే" అర్థంకానట్టు చూశాడు సుందరరామయ్య కళ్ళు పెద్దవిచేసి.

"ఇది" చూపుడు వేలును బొటన వేలుతో మీటుతూ అన్నాడు ప్యూన్.

"....ఛీ.... ఛీ.... అడుక్కునైనా బ్రతుకుతాం కాని ఇలాంటి నీచ వ్యవ హారాలను ప్రోత్సహించను...."

"ఉద్యోగం కావాలనుకుంటే అదే గత్యంతరం.... ఆ పైన మీ ఇష్టం." ప్యూన్ వెళ్ళిపోయాడు.

సుందరరామయ్య మనసు అస్తవ్యస్త మైపోయింది. దీర్ఘంగా నిట్టూర్చి భారంగా కదిలాడు.

హుఁ.... నిరంజన్ ఎన్ని నీతులు వల్లించాడు! ఇవా వీడు ఆచరిస్తున్న నీతి నియమాలు? ఇవా వీడి ప్రిన్సిపల్సు? డబ్బుకి ఉద్యోగాలమ్ముకొనే దౌర్భాగ్య స్థితికి దిగజారిన వీడికి మానవత్వం, మమతానురాగాలూ, భక్తి విశ్వాసాలూ

వుంటాయనుకోవడం అవివేకం. తన కొడుక్కి ఉద్యోగం ఇచ్చినా ఇవ్వక పోయినా నిరంజన్ నీతిమంతుడుగా బ్రతుకుతున్నాడని అంతరాంతరాల్లో ఇంతవరకూ తను వాడిని ప్రశంసిస్తు న్నాడు. తను నాటిన మొక్క మహా వృక్షమై మధురఫలాల నిస్తోందని గర్వించాడు. కాని ఆ వృక్షానికి వేరు పురుగు పట్టింది! పతనం తప్పదు.... ఇంతకీ వాణ్నని ప్రయోజనంలేదు. ఇదంతా కాలమహిమ....

"తాతగారూ.... మిమ్మల్నేనండీ...."

ఆలోచిస్తూ నడుస్తున్న సుందర రామయ్య ఆగి వెనక్కి తిరిగి చూశాడు. ఎవరో అమ్మాయి నిలబడివుంది. పదేళ్ళ వయస్సుంటుంది. చిన్నగా నవ్వుతూ,

"అమ్మగారు పిలుస్తున్నారు రండి" అంది.

"ఎవరా అమ్మగారు! .... ఎక్క డున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడు సుందరరామయ్య.

"రాజేశ్వరమ్మగారు.... అదుగో ఆ మేడే వారిది" అంది ఆ పిల్ల వేలితో అటు చూపిస్తూ.

'ఎవరు? ఎవరామె?....తను ఈ వూరు రావడం ఇదే ప్రథమం - తనకి తెలిసిన వాళ్ళెవరూ ఇక్కడ లేరు.... జీవితంలో తను ఎంతోమందిని చూశాడు. చాలా మందితో పరిచయం వుంది. బహుశా వాళ్ళలో ఎవరో అయ్యుండవచ్చు. వెళ్ళి చూస్తే తెలుస్తుంది' అనుకుంటూ "పద వెళ్దాం" అన్నాడు. ఆ పిల్ల ముందు నడిచింది. "రండి లోపలికి" సాదరంగా సుందరరామయ్యను హాల్లోకి ఆహ్వానించి, సోఫా చూపించి "కూర్చోండి" అంది రాజేశ్వరి.

'ఈమెను తనెక్కడ చూశాడో గుర్తులేదు. ఎవరీమె? ఈమెకి తనెలా తెలుసు?' అనే ప్రశ్నకు సమాధానం దొరక్క సతమతమవుతూ కూర్చున్నాడు సుందరరామయ్య.

ఆమె బోర్నవిటా పంపించింది. అది తాగి సోఫాలో జారబడి కూర్చున్నాడు. అతనికి అలసట కాస్త తగ్గింది.

"మీరు నన్ను మరచిపోయుంటారు. కానీ మీరు నాకు గుర్తున్నారు" చిన్నగా నవ్వుతూ ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంటూ అంది రాజేశ్వరి.

సుందరరామయ్య అయోమయంగా చూశాడు.

రాజేశ్వరి నవ్వి, అభిమానంగా చూస్తూ అంది.

"ఒక వ్యక్తి - మరొక వ్యక్తికి ఏదో ఒక సందర్భంలో ఉపకారం కాని అపకారం కాని చెయ్యడం జరుగుతుంది. అది చేసిన వ్యక్తి మరిచిపోయే అవకాశం వుంది కాని ఫలితాన్ని అనుభవించిన వాళ్ళు మరిచిపోలేరు."

"మీ మాటలు నాకర్థంగావటంలేదు" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు సుందర రామయ్య.



"సుమారు పది సంవత్సరాల క్రితం మీరు చేసిన ఉపకారం నేను అజన్మాంతం మరచిపోలేను. అప్పుడు మీకు కృతజ్ఞతలు చెప్పుకొనే అవకాశం లేకపోయింది. ఆ తరువాత మూడు నాలుగుసార్లు మీరు కనిపించినా, మీతో మాట్లాడానికి వీలు చిక్కలేదు. మళ్ళీ ఇదే మిమ్మల్ని చూడ్డం."

"కృతజ్ఞతలు చెప్పుకోవాల్సినంత ఉపకారం మీకేం చేశానో జ్ఞాపకం రావడంలేదు" ఆలోచిస్తూ అన్నాడు సుందరరామయ్య.

"....ఆ సంఘటన తల్చుకుంటే ఇప్పటికీ నా కాళ్ళు ఒణుకుతాయి. ఆ రోజు సాయంకాలం పార్వతీపురం స్టేషన్‌లో మా నాన్నగారు ట్రెయిన్ ఎక్కించారు. మరునిముషంలో ట్రెయిన్ కదిలి వేగాన్ని పుంజుకుంది. నేను కిటికీ లోంచి మా నాన్నగారిని చూస్తూండి పోయాను. ఆయన ముఖంలో ఏదో తీవ్రమైన ఆందోళన కనిపించింది. ఏదో అంటూ సంజ్ఞలు చేశారు. నా కర్థం కాలేదు. నన్ను ఒంటరిగా పంపిస్తున్నందుకు బాధపడుతున్నారనుకొని - ఆయన కనుమరుగయ్యేవరకూ చూసి, సీట్లో కూర్చున్నాను.

ట్రెయిన్ నరిసిపురం వదిలింది. కంపార్ట్‌మెంట్‌లో టికెట్ చెకింగ్ ప్రారంభమైంది. టికెట్ కలెక్టర్‌ని చూడగానే నా గుండె ఝుల్లుమంది. అప్పుడు తెలిసింది మా నాన్నగారి ఆందోళనకి అర్థం. ఆ రోజు ట్రెయిన్ రెండు గంటలు లేటు – మేంకూడా స్టేషన్‌కి అలస్యంగానే వచ్చాం. మేం వచ్చేసరికి ట్రెయిన్ ఎంటరవుతోంది. నన్ను ట్రెయిన్ ఎక్కించే హడావుడిలో టిక్కెట్టూ, నాకు ఇద్దామనుకున్న డబ్బూ ఇవ్వడం మరిచిపోయారు మా నాన్నగారు. నే నెప్పుడూ ఒంటరిగా ప్రయాణం చెయ్యలేదు. పైగా టిక్కెట్ లేదు. డబ్బూ లేదు. విపరీతమైన భయం నన్నావహించింది. ఒళ్ళంతా చెమటలు పట్టేసి, ఒణకడం ప్రారంభించింది. జరగబోయే అవమానాన్నీ తదనంతర విషమ పరిస్థితినీ ఎలా ఎదుర్కోవాలో తెలియక క్రుంగిపోసాగాను. అంతలోనే టికెట్ కలెక్టర్ టికెట్ అడగడం, నేను ఏడుపు మొహంతో జరిగినది చెప్పడం నిముషాలమీద జరిగిపోయాయి. అతనేం వినిపించుకోలేదు, 'పార్వతీపురం నుంచి వాల్తేరుకి టికెట్ రాస్తాను డబ్బు తియ్యండి – లేకపోతే సీతానగరంలో మర్యాదగా దిగిపోండి' అనేసి తన పని చూసుకోసాగాడు. 'నా దగ్గర డబ్బు లేదు – ఈ వుంగరం తీసుకొని టికెట్ రాసి ఇవ్వండి ప్లీజ్' అని నా వుంగరం తియ్యబోయాను. అతను అంగీకరించలేదు. నాకు దుఃఖం వచ్చేసింది. అవమానంతో సిగ్గుతో సగం చచ్చిపోయాను. కంపార్ట్‌మెంట్‌లో కొందరు సానుభూతిగా చూస్తున్నారు. కొందరి అడ్డదిడ్డమైన చూపులు నాకు గుచ్చుకుంటున్నాయి. రౌడీ వెధవలిద్దరు నోటికొచ్చిన కారుకూతలు కూస్తున్నారు. తల తిరిగిపోతూంటే నిలబడలేక సీట్లో కూలబడిపోయాను. ట్రెయిన్ సీతానగరంలో ఆగింది. జనవరి నెల కాబట్టి అప్పటికే చీకట్లు అలుముకోసాగాయి. రౌడీ వెధవలు ఆ స్టేషన్‌లోనే దిగిపోయారు. నన్ను హెచ్చరించి టికెట్ కలెక్టర్ దిగి, ప్లాట్‌ఫారంమీద నిలబడ్డాడు. నా కళ్ళు వర్షిస్తున్నాయి. కాళ్ళు ఒణుకుతున్నాయి. భయం భయంగా ఎంట్రన్స్ దగ్గరకు వచ్చాను. అదే సమయంలో మీరు కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కుతూ నన్ను చూశారు. విషయం తెలుసుకున్నారు. మీ హృదయం కరిగింది. తత్ఫలితంగా వాల్తేరు వరకూ నా ప్రయాణం నిశ్చింతగా జరిగింది. లేకపోతే ఆ సీతానగరంలో....ఒంటరిగా....ఏమయ్యేదాన్నో..... మాన మర్యాదలు పోయాక ఆత్మహత్యే శరణ్యమయేది" గాఢంగా నిట్టూర్చింది రాజేశ్వరి.

సుందరరామయ్య చిరునవ్వు నవ్వాడు. "మీరు అనవసరంగా భయపడ్డారు. నేను రాకపోయినా, మీ రూహించినంత ఘోరం జరగదని నా వుద్దేశం...." అన్నాడు.

"ఏమోమరి.... నేను మాత్రం చాలా భయవిహ్వాలనయాను. నా మనసు కీడే శంకించింది. తల్చుకుంటే ఒళ్ళు జలద రిస్తుంది...." గతాన్ని తల్చుకుంటూ గంభీరంగా వుండిపోయింది రాజేశ్వరి.

సుందరరామయ్యకి ఇక అక్కడ కూర్చోవాలనిపించలేదు. మనసు కలతగా వుండడంవల్ల త్వరగా ఇంటికి పోదామనే ఆతృత ఎక్కువకాసాగింది. "మరి నేను వెళ్ళొస్తానమ్మా. త్వరగా వెళ్ళక పోతే ట్రెయిన్ అందదు" అంటూ లేవబోయాడు.

రాజేశ్వరి చప్పున లేచి నిలబడింది. "అయ్యో అప్పుడే వెళ్ళిపోతారా?.... వంటవుతోంది. భోజనంచేసి విశ్రాంతి తీసుకొని సాయంకాలం ట్రెయిన్‌కి వెళుదురుగాని. ఈ పూట దయచేసి నా ఆతిథ్యాన్ని స్వీకరించాలి" అంటూ ప్రాధేయపడింది.

సుందరరామయ్యకి కూర్చోక తప్పింది కాదు. వంటమనిషి వడ్డించి పిలిచేవరకూ ఇద్దరూ మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఒకరి వివరాలొకరు తెల్సుకున్నారు. సుందరరామయ్య చెప్పిన సంగతులు విని రాజేశ్వరి అమితంగా విచారించింది. సాయంకాలం అయిదు గంటల వరకూ విశ్రాంతి తీసుకొని, వంటమనిషి ఇచ్చిన బోర్న్‌విటా తాగి "ఇహ వెళ్ళొస్తానమ్మా" అంటూ బయలుదేరాడు సుందరరామయ్య.

రాజేశ్వరి హృదయపూర్వకంగా నమస్కరించింది.

"మీరు అన్యథా భావించకుండా నాదొక చిన్న కోరికను మన్నించాలి.... మీ శ్రీధర్‌ని తీసుకొని వచ్చే బుధవారం రావాలి. మావారు మంగళవారంనాడు బొంబాయినుంచి వస్తారని చెప్పానుగా- వారు రాగానే మా ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇచ్చే ఏర్పాటు చేస్తాను. మీరు అబ్బాయిని తీసుకొస్తే వారే అన్ని ప్రయత్నాలూ చేస్తారు. మీరేం శ్రమపడ నవసరంలేదు...." అభిమానంగా చూస్తూ అంది రాజేశ్వరి.

సుందరరామయ్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అంతరంగంలో ఆనందం వెళ్ళివిరిసింది.

"అలాగే తల్లీ....అలాగే.... తప్పకుండా వస్తాం - భగవంతుడు మీకు మేలు చేస్తాడు తల్లీ" బొంగురు గొంతుతో అన్నాడు కళ్ళొత్తుకుంటూ.

వంటమనిషి వెంటరాగా, రాజేశ్వరి సుందరరామయ్యను గేటు వరకూ సగౌరవంగా సాగనంపింది.

"ఎవరమ్మా .... ఆ బాబు...." గొణిగింది వంటమనిషి.

"మా అన్నయ్య.... మా పెదతల్లి కొడుకు...." అంది రాజేశ్వరి హృదయ పూర్వకంగా. ఆ సంభాషణ విన్న సుందరరామయ్య కళ్ళు వర్షించాయి. రాజేశ్వరికేసి అభిమానంగా చూసి అడుగు ముందుకేశాడు.

— — —